

పాములకూరు జ్ఞానసుందర్

■ ఆరోజు—

జమీందారు రాజశేఖరం గారి బంగళాలో నిశ్శబ్దం నృత్యం చేస్తోంది. ఆ బంగళాలో పనిచేసే ప్రతివాడూ ప్రాణాలరచేతిలో పెట్టుకున్నారు.

"జమీందారు రాజశేఖరం గారింట్లోనా ఈ విధంగా జరగడం అసంభవం, ఇంతకీ ఎవరు చేశారు యీ పని?" ప్రతి ఒక్కరూ ప్రశ్నించుకొంటున్నారు మనసుల్లోనే!

అందరూ రాజశేఖరంగారి నమ్మినబంట్లే, తమతమ ముత్తాతల కాలం నుంచీ యీ జమీందారీ కుటుంబంపై ఆధారపడి జీవిస్తున్న వాళ్లు! వారి ఉప్పు కారం తింటూ వారికే ద్రోహం తలపెట్టేవాళ్ళెవరై ఉంటారు?

ఇంతకీ ఆభవనంలో జరిగిన సంఘటనేమిటంటే–రాజశేఖరం గారి ముద్దుల భార్య అరుణాదేవిగారి ఆరో ప్రాణం అయిన వజ్రాల హారం కనపడక పోవటమే!

బిలియనీశ్వరుడు, సుమారు ఏడెనిమిదివందల ఎకరాల మాగాణీ, మూడు షుగర్ ఫ్యాక్టరీలు, ఎప్పుడూ ఫారిన్ సరుకు మాత్రం ఉండేబారు, ఓ పెద్ద కార్ల కంపెనీలో షేర్లు వుండే రాజశేఖరంగారు తన సతీమణికి మరొక హారం చేసియివ్వ లేక కాదు! ఆ హారం తమ అత్తగారు అంటే, అరుణాదేవిగారి అమ్మగారు చనిపోతూ "ఈ హారం నా ప్రాణం! నా జ్ఞాపక చిహ్నంగా వుంచుకో!" అంటూ యిచ్చిన కానుక కనుకనే అరుణాదేవిగారు ఆహారాన్ని తన ఆరోప్రాణంగా జమకట్టింది.

తమ సతీమణికి ఆరో ప్రాణం హారం అయితే, తనకి అదు ప్రాణాలు తన భార్య అరుణాదేవి.

తన ఏడెనిమిది వందల ఎకరాల మాగాణి పంట పండక పోయినా, షుగర్ ఫ్యాక్టరీలో నష్టంవచ్చినా. లైసన్స్ లేని ఫారిన్ సరుకును ప్రభుత్వం పట్టివేసినా, కార్లకంపెనీ పేలిపోయినా బాధపడని జమీం

**హారం దొంగిలించాల్సిన ప్రమేయంలేదు వెంకడికి. పోనీ.... హారం దొం(గి)లించినా ఎవరికి తీసుకెళ్ళి ఇవ్వగలడు? అతనికి కూతురుందా! మనవరాలుందా? పెళ్లాముం(దా)? లేరే? ఎవ్వరూ లేరే?**

దారు రాజశేఖరం తనభార్య నిద్రా హారాలుమాని, శోకదేవతలా కూర్చుండి పోయిందంటే భరించ లేకున్నాడు.

అందుకే బంగళాలో పనిచేసే వారందర్నీ పిలిపించాడు.

"మీలో ఎవ్వరీపని చేసింది? నిజంచెప్పండి, నాకే నమ్మక ద్రోహం తలపెడ్తారా? చెప్పండి! ఎవరు చేశారీపని?"— జమీందారు రాజశేఖరంగారి గొంతు గంభీరంగా గర్జిస్తోంది.

అక్కడవున్నవాళ్లే అందరూ తల్లొంచుకున్నారు.

ఇంకాసేపట్లో ప్రళయం రాబో తుందా అన్నట్లుంది బంగళా వాతా వరణం.

"అంటే మీరెవ్వరూతీయలేదన్న మాట! నేను నమ్మను మీరు తప్ప యింకెవ్వరూ ఆ హారాన్ని తీసేం దుకు అవకాశం లేదు. మీలోనే ఎవరో ఒకరు ఆ హారాన్ని తీసి వుండాలి! ఎవరు తీశారు? నిజం చెప్పకపోయారంటే కుక్కల్ని కాల్చినట్లు కాల్చిపారేస్తాను." భీక రంగా చెప్పాడు రాజశేఖరం.

పని మనిషి రత్తాలు ధైర్యంచేసి ముందుకొచ్చింది. "సామీ! మీరు సెప్పినట్టు మాలో ఎవళ్ళో ఒకళ్ళు ఆ అరం తీసుంటారు. ఎవళ్ళు తీసిందీ తెలవదు. అందుకేసామి, నాదో చిన్నమనవి. మా గూడెం కాడ వుండే రంగమ్మకు పూనకం వచ్చుద్దిసామీ!... ఆయమ్మ మీద గంగమ్మ పూనుద్దిసామీ గంగమ్మ తల్లి నిజం చెప్పుద్దిసామీ! ఎవళ్లు తీసిందీ!"

అంతక (న్నా) సంలోనూ రాజశేఖరం గార్కి ... సలహా నచ్చింది. వెంటనే ఓ ...రపై కొబ్బరికాయలు, ఓ అరవీశె(డు) కర్పూరం, ఓ తట్టెడు సాంబ్రాణి, ఓ బుట్టడు పూలు ఎత్తించుకొ(ని) బయలుదేరాడు గంగమ్మ (గు)డికి. గంగమ్మ తల్లి పూనే రం(గ)మ్మని పిలిచారు.

గంగమ(్మ)కి పూలు వేసారు, హారతిచ్చా(రు) గుడిని సాంబ్రాణి పొగతో ని(ంపా)రు. కొబ్బరికాయలు తెగ్గొడుతున(్నా)రు.

ఇంతల(ో) రంగమ్మకి పూనకం వ(చ్చి)ంది.

రంగమ(్మ) విభూతి పట్టెడు తీసు కుంది. కా(షా)యరంగు చీర కట్టు కుంది. వె(ం)టుకలంతా జడలు కట్టుకుపో(య)ింది.

ఎవరో (ఆ)మె చేతికి వేపాకు మండలిచ్చా(రు). మరో అరచేతిలో కర్పూరం (వె)లిగించారు. వెలుగు తున్న కర్పూ(రా)న్ని అలాగే నోట్లో వేసుకు మిం(గే)సింది గంగమ్మతల్లి.

అందరూ (భ)క్తితో చేతులు కట్టు కుని నిలబడి(వు)న్నారు.

"ఒరేయ్ (ఎందుకు) వరసుకుంటున్నార్రా నన్ను? నే(ను).... గంగమ్మ తల్లి నిరా? ఏ(ం) (కావా)ల్రా మీ కోరిక? ఎందుకు పిలి(చా)ర్రా నన్ను?—" గంగమ్మతల్లి అడుగుతోంది,

"అమ్మా (గ)ంగమ్మ తల్లీ! నా భార్యకి యిష్ట(మై)న హారాన్ని ఎవరో దొంగిలించార(ు) ఆ హారం పోయి నప్పట్నుంచి (మా) ఆవిడ నిద్రహా రాలు మా(ని)సింది తల్లీ! ఆ హారాన్ని ఎ(వ)రు దొంగిలించారో చెప్పు తల్లీ!" అని చేతులు జోడిం చారు రాజశేఖరం.

"బిడ్డా! నా బిడ్డల కష్టాలు తీర్చడమే నా పని. అందుకేరా నేను ఎలిసింది. నా బిడ్డలు కన్నీళ్ళకారిస్తే నేను చూళ్ళేనురా!"

రాజశేఖరం గారి దివాణంలోని ఉద్యోగులందరూ ఇంకాసేపట్లో హైడ్రోజన్ బాంబు ప్రేలబోతుం దని ముందుగానే తెలిసిన వాళ్ళలా చావుమొహాలతో వున్నారు.

అప్పుడే చెప్పింది గంగమ్మ తల్లి.—"బంగళాలో వుండే వెంకడే ఆ హారాన్ని తీశాడని."

పని వాళ్ళందరూ తమ చెవుల్ని తమే నమ్మలేకపోయారు. డెబ్భై ఏళ్ళకి పైబడి, ఎముకలగూడుతో వున్న వెంకడే అంతపనీచేశాడంటే!

వెంకడు తమకు తెల్సినప్ప ట్నుంచి ఆజమీందారీ కుటుంబాన్నే అంటిపెట్టుకు బతుకుతున్నాడు.

వెంకడికి ముందూ వెనుకా ఎవరూలేరు. వేసిన అన్నం తిని ఇచ్చిన గుడ్డకట్టుకుని కాలం వెళ్ళ బుచ్చేవాడు.

హారం దొంగిలించాల్సిన ప్రమే యంలేదు వెంకడికి. పోనీ.... హారం దొంగిలించినా ఎవరికి తీసు కెళ్ళి ఇవ్వగలడు? అతనికి కూతు రుందా! మనవరాలుందా? పెళ్లా ముందా? లేరే? ఎవ్వరూ లేరే?

మరి?

గంగమ్మతల్లి అబద్ధం చెబు తుందా? ఊహూఁ! దేవతల తల్లేంటి, అబద్ధం చెప్పడం ఏమిటి?

జనం మాట అటుంచి రాజ శేఖరం అగ్గిమీద గుగ్గిలమే అయ్యాడు.

వెంకడు తీశాడంటూనే కోపంతో బిర్రబిగుసుకుపోయాడు. పరుగు లాంటి నడకతో ప్రళయకాల రుద్రు డిలా బయల్దేరాడు బంగళాకి.

తీసుకున్నాడు చేతికి కొరడా! "ఒరే వెంకడూ! ఒరే వెంకడూ!" అతని కంఠం ప్రతిధ్వనిస్తోంది బంగళా అంతా!

"రా రా! ఇటు"

భయంతో వణికిపోతున్నాడు వెంకడు.

కోపంతో ఊగిపోతున్నాడు రాజ శేఖరం.

"ఒరేయ్! నాకే ద్రోహం తల పెడ్తావట్రా! నా కూడు తిని, నా గుడ్డ కట్టి నాకే ఎసరు పెడతా వట్రా!"

లేచింది గాల్లోకి కొరడా! ఒకటి రెండు, మూడు.... కాదు తన కసి దీరా కొడుతూనే వున్నాడు.

అలాబాదుతున్నా బదులు చెప్ప లేదు వెంకడు.

అలసిపోయాడు రాజశేఖరం.

క్రింద పడిపోయింది వెంకడి ఎముకల గూడు.

అనంతవాయువుల్లో కల్సిపో యింది వెంకడి ప్రాణం.

"ఈడ్చుకెళ్లి పారేయండ్రా" దర్పంగా అన్నాడు రాజశేఖరం.

బదులుపలక్క తీసుకెళ్ళి పోయారు సేవకులుగంగమ్మతల్లికి-ప్లస్ జమీందారు రాజశేఖరంగారి మెహర్బానికి బలయిన వెంకడ్ని.

* * *

మరునటి రోజు అరుణాదేవిగారి పట్టుపరుపు దులుపుతూ వుంటే కన పడింది పనిమనిషి రత్తాలుకి ఆ దిండుక్రింద హారం. ❋